క్లుప్తంగా

తరిగొండ ఆలయంలో విశేష పూజలు



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ మెస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడ కాలువలు అక్కడ పేరుకుపోయాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, 20 రోజులు అవుతున్నా కొన్ని ప్రాంతాల్లో అలానే ఉండిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. త్వరితగతిన పారిశుద్ధ్య కార్యర్యక్రమాలు చేపట్టాలన్నారు. పీలేరులో దోమల బెడద ఎక్కువైందని, ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు రమణ, విక్టరీ, సాంబశివారెడ్డి, సచిన్, కాలేషా, పరమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామికి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, అర్చకులు గోవర్ధన్‌భట్టార్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పీలేరురూరల్ : యూటీఎఫ్ పీలేరు మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఎస్. శివారెడ్డి అధ్యక్షతన యూటీఎఫ్ పీలేరు మండల స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శివారెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడిగా జి. సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడిగా అంజిరెడ్డి, సహాధ్యక్షుడిగా మస్తాన్, నాగరత్నమ్మ, జిల్లా కార్యదర్శులుగా ఎస్. శివారెడ్డి, అక్రమ్‌బాషా, అలివేలు, విశ్వనాథరెడ్డి, నర్సింబేగం, రమణయ్య, సుధాకర్, మండల కౌన్సిలర్ కె. విజయకుమార్, సిద్దప్ప, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునిరెడ్డి, సుబ్రమణ్యం, రహంతుల్లా, రమణయ్య, సుబ్రమణ్యం, హరినాథ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు జాబీర్‌బాషా, చంద్రశేఖర్, సదాశివారెడ్డి, అక్రమ్‌బాషా, ఈశ్వరమహేంద్ర, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వీఓ, ఎంఎస్ నిధులపై విచారణ

బి.కొత్తకోట: మహిళా సంఘాల్లో విధుల నిర్వహణ, నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై సోమవారం బి.కొత్తకోటలో డీఆర్‌డీఏ అధికారుల బృందం విచారణ చేపట్టనుంది. బి.కొత్తకోట మండల సమాఖ్య పరిధిలో పనిచేసే గ్రామ సమాఖ్యల ద్వారా మహిళా సంఘాలకు అందించే రుణాలు, వాటి రికవరీ, వడ్డీ వసూలు, సంఘాల సభ్యుల వివరాలపై విచారణ జరుగుతుందని సంబంధిత అధికార వర్గాలు తెలిపారు. ఎంఎస్, వీఓ ద్వారా జరిగిన లావాదేవిలపై విచారణ చేపట్టనున్నారు. సంబంధిత రికార్డులు, నివేదికలను స్థానిక వెలుగు సిబ్బంది సిద్ధం చేసుకుంటున్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

మదనపల్లె: బహిరంగంగా మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కొండయ్యనాయుడు హెచ్చరించారు. శనివారం రాత్రి మదనపల్లె పట్టణ పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 28 మందిని అదుపులోకి తీసుకుని డీఎస్పీ కార్యాలయం వద్ద కౌన్సిలింగ్ నిర్వహించారు. సాయంత్రం, రాత్రి వేళల్లో బహిరంగంగా మద్యం సేవించే వారిని అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం సేవించడంతో పాటు గొడవపడటం, దాని పక్కనే బాటిల్స్ పగలగొట్టడం, ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడం చేస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. శనివారం రాత్రి 28 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు ఒక కారు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నిఘా కొరవడి.. గస్తీ తడబడి

- రైతులపై వరుస దాడులు
- గంజాయి మూకల హల్‌చల్
- భయాందోళనలో అన్నదాతలు



మార్కెట్‌యార్డులో రైతుపై దాడికి పాల్పడిన అల్లరి మూకలు (ఫైల్)

గుర్రంకొండ: గుర్రంకొండ మార్కెట్‌యార్డులో పోలీసుల నిఘా కొరవడింది. పోలీసుల గస్తీ తగ్గిపోవడంతో యార్డులో రైతులపై దాడులకు దిగుతున్నారు. యార్డులో పనిచేయడానికి బయట రాష్ట్రాల నుంచి 700 మంది కూలీలు వచ్చారు. దీనికి తోడు గంజాయి మూకలు మత్తులో హల్‌చల్ చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. దీంతో యార్డులో అడుగుపెట్టాలంటే రైతులు భయాందోళన చెందుతున్నారు.

వేలాది మంది రైతులు రాక

స్థానిక మార్కెట్ యార్డుకు నిత్యం వేలాది మంది రైతులు వస్తుంటారు. నాలుగు మండలాలకు చెందిన రైతులు ప్రతిరోజు టమాటాలు తీసుకువస్తుంటారు. 33 మండీలూ యార్డులో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి టమాటాలు యార్డుకు వస్తుంటాయి. సాయంకాలం 4 గంటల నుంచి వేలం పాటలు ప్రారంభమవుతాయి. రాత్రి 11 గంటల వరకు టమాటాలు లోడు చేసుకొని బయట ప్రాంతాలకు తీసుకెళ్తారు. ప్రతిరోజు 700 టన్నులకుపైగా టమటాలు మండీలకు వస్తుంటాయి. నిత్యం వాహనాల రాకపోకలు, రైతులతో యార్డు సందడిగా ఉంటుంది.

రైతులపై దాడులు

యార్డులో టమాటాలను తీసుకొచ్చే రైతులపై దాడులు చేయడం నిత్యకృత్యంగా మారాయి. గాలివీడు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, కురబలకోట, కలకడ మండలాల నుంచి నిత్యం వేలాది మంది రైతులు టమాటాలను ఇక్కడి యార్డుకు తీసుకొస్తుంటారు. రైతులను దూషించడం, దాడులకు పాల్పడడం కొందరికి పరిపాటిగా మారింది. ఇటీవల ఎల్లుట్లకు చెందిన మల్లికార్జున అనే రైతుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గతంలోనూ రైతులపై కొంతమంది దళారులు, వ్యాపారులు దాడులు చేసిన సంఘటనలు చోటుచేసుకొన్నాయి.

బయట రాష్ట్రాల నుంచి కూలీలు

మార్కెట్‌యార్డులోని టమాటా మండీల్లో పనిచేయడానికి ఛత్తీస్‌గడ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి సుమారు 700 మంది వరకు కూలీలు వచ్చారు. అయితే వీరిలో కొంత మందికి నేరచరిత్ర ఉందో ఎవరికీ అంతుచిక్కడం లేదు. సాధారణంగా ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రంలో పనిచేయడానికి వెళ్లినప్పుడు ఎన్‌ఓసీ తీసుకెళ్లాల్సి ఉంటుంది. గతంలో బీహార్ పోలీసులు ఇక్కడికి వచ్చి కొంతమంది నేరచరిత్ర ఉన్నవాళ్లను అరెస్ట్ చేసి తీసుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి.

హడలెత్తిస్తున్న అల్లరిమూక

మార్కెట్‌యార్డులో నిత్యం జన సంచారం రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో గంజాయి మూకల హల్‌చల్ చేస్తూ హడలెత్తిస్తున్నారు. పట్టణానికి చెందిన కొంతమంది అల్లరిమూకలు గంజాయి మత్తుకు బానిసలయ్యారు. వీరికి తోడు బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కొంతమంది తోడవడంతో మార్కెట్లో వీరి ఆగడాలకు అంతులేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులపై దాడులకు పాల్పడడం గంజాయి మూకలకు అలవాటుగా మారింది.

కొరవడిన నిఘా

వేలాది మంది రైతులు వచ్చే మార్కెట్‌యార్డు వద్ద పోలీస్ నిఘా కొరవడడంతో తమపై దాడులు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మార్కెట్‌యార్డుకు వెళ్లాలంటే రైతులు భయాందోళన చెందుతున్నారు. బయట వ్యక్తులతో పాటు గంజాయి మూకల సంచారంతో మార్కెట్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే రైతులపై గంజాయిమూకలు దాడులకు దిగుతున్నారు. దీంతో బయట ప్రాంతాల నుంచి వచ్చే రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిఘా పెడతాం



మార్కెట్లో రైతులపై దాడులు జరుగుతున్నందున కొత్త వ్యక్తుల సంచారంపై నిఘా పెడతాం. మార్కెట్‌యార్డులో మా సిబ్బంది అన్ని వేళలా రైతులకు అందుబాటులో ఉంటారు. అన్ని టమాటా మండీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

–కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

పోలీస్ గస్తీ పెంచుతాం



మార్కెట్‌యార్డులో పోలీస్ గస్తీ పెంచుతాం. ఇటీవల యార్డులో రైతుపై దాడి చేశారు. సకాలంలో మేము వెళ్లి తగిన చర్యలు చేపట్టడంతో వివాదం సద్దుమనిగింది. యార్డులో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటాం.

– మధు రామచంద్రుదు, ఎస్‌ఐ, గుర్రంకొండ

ముమ్మరంగా పశుగణన సర్వే



గుర్రంకొండ: పశుగణన సర్వే నిర్వహిస్తున్న మండల పశువైద్యాధికారి సునీల్ నాయక్



పెద్దమండ్యం: పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, వెటర్నరీ డాక్టర్‌లు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో పశుగణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. శనివారం స్థానిక నబీకాలనీలో పశుగణనపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆవులు, గేదెలు, పందులు, గొర్రెలు, కుక్కలు, కోళ్లు, పెంపుడు జంతులు ఎన్ని ఉన్నాయో పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి సునీల్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి పశుగణన సర్వే కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సర్వే ఆధారంగా భవిష్యత్‌లో మండలానికి ప్రభుత్వం నుంచి మందులు, ఇతర పశుసామగ్రి మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా నిర్వహించాలి

పెద్దమండ్యం: మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో పశుగణన పక్కాగా నిర్వహించాలని వెటర్నరీ వైద్యులు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం 21వ అఖిలభారత పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పశుగణన కార్యక్రమంలో పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, గుర్రాలు, కుక్కలతో సహా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారం సేకరిస్తామని తెలిపారు. సమాచారాన్ని సిబ్బంది ప్రజల ఇంటి వద్దనే లెక్కించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఈఓపీఆర్‌డి జనార్దన్, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన చౌడమ్మ

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె సాయిరాంవీధికి చెందిన రవి భార్య చౌడమ్మ (38) బంధువులతో కలిసి ములకలచెరువు పెళ్లిచూపులకు వెళ్లింది. తిరిగి తన బంధువైన భరత్‌తో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, కాండ్లమడుగు క్రాస్ సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పి చౌడమ్మ కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతపురం పట్టణానికి చెందిన సద్దాంహుస్సేన్ (31), సాదిక్ (30), సయ్యద్‌షావలీ (45) వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో చిత్తూరుజిల్లా బంగారుపాళ్యంకు పనుల నిమిత్తం వచ్చి పూర్తిచేసుకుని తిరిగి ఆటోలో అనంతపురానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె వద్ద ఎదురుగా మరో ఆటో రావడంతో ఆటోను తప్పించే క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వృద్ధుడికి ఆర్థిక సాయం

మదనపల్లె : సబ్ కలెక్టరేట్ ఆవరణలోని చింతచెట్టు మీద పడి తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని పలువురు ఆర్థికంగా ఆదుకుంటున్నారు. వారంరోజుల క్రితం సబ్ కలెక్టరేట్ ఆవరణలోని చింతచెట్టు కూలి, రోడ్డుమీద వెళుతున్న వృద్ధుడిపై కొమ్మలు పడటంతో కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదఘటనలో బాధిత వృద్ధుడు చంద్రశేఖర్‌కు రెండుకాళ్లు విరిగి, వెన్నెముక దెబ్బతింది. వృద్ధుడు నిరుపేద కావడం, వైద్యఖర్చులకు కష్టంగా ఉండటంతో ఆయన కుమార్తెలు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యులు ఆరురోజులవుతున్నప్పటికీ వృద్ధుడికి వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం కనపరుస్తుండటం, ఆపరేషన్ చేయకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు విషయాన్ని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ దృష్టికి తీసుకెళ్లారు. తమ తండ్రి పరిస్థితిని వివరించి, ఆదుకోవాలని వేడుకున్నారు. దీంతో స్పందించిన ఆయన అప్పటికప్పుడే వృద్ధుడి కుమార్తె భార్గవికి, డీఏఓ పద్మావతి ద్వారా రూ.10వేలు ఆర్థికసహాయాన్ని అందజేశారు. రుయా ఆస్పత్రి ఆర్‌ఎంఓకు ఫోన్‌చేసి చంద్రశేఖర్‌కు వైద్యసేవలతో పాటుగా ఆపరేషన్ చేయాల్సిందిగా కోరారు. వృద్ధుడి వైద్యఖర్చులకు మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందజేశారు.

ఫ్లై ఓవర్ నుంచి పడి కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన కార్మికుడు

కురబలకోట: అంగళ్లు బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఫ్లై ఓవర్ పనులు చేస్తుండగా ఛత్తీస్‌గడ్‌కు చెందిన కార్మికుడు రవి (48) శనివారం సాయంత్రం తీవ్రంగా గాయపడ్డారు. ఫ్లై ఓవర్‌పై 25 అడుగుల ఎత్తులో గేట్లు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు పట్టు తప్పి కిందపడ్డాడు. నడుం, చేతులు, కాళ్లు తీవ్రంగా గాయపడ్డాయి. హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర అన్నారు. శనివారం స్థానిక బర్మావీధిలోని పాఠశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వల్ల ఉపయోగాలు గురించి వివరించారు. మొక్కలు నాటడం సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. చెట్లు ప్రాముఖ్యత గురించి పిల్లలకు వివరిస్తూ వారితో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు, హెచ్‌ఎం జ్యోతి, ఉమాపతి పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో సీసీ రోడ్లు



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

మదనపల్లె : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మదనపల్లె మండలంలో రూ.3 కోట్ల నిధులతో 74 సిమెంట్ రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. శనివారం మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బాబూకాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఏపీడీ మధుబాబు, పీఆర్ ఏఈ మోహన్, ఏపీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజలకు పోలీసులు మంచి మిత్రులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామాంజనేయులు

కలకడ : ప్రజలకు పోలీసులు మంచి మిత్రులని ఎస్‌ఐ రామాంజనేయులు అన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విద్యార్థులకు లాకప్, రౌడీలు, ముద్దాయిలకు వేసే బేడీలు, మహిళలకు కేటాయించిన సెట్లు, దిశా చట్టం, పౌరులహక్కుల గురించి వివరించారు. బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. బాలికలు, మహిళలకు రక్షణతో పాటు, ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలియజేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి అన్ని రంగాలలో రాణించాలని సూచించారు.

గ్రీన్ మదనపల్లెకు సహకరించాలి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా తలపెట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని గ్రీన్ మదనపల్లెగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. శనివారం పట్టణంలోని బుగ్గకాలువ ఎన్.వీ.ఆర్. ఫంక్షన్ హాల్ సమీపంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో రోజురోజుకీ పెరుగుతున్న పట్టణీకరణ, కాలుష్యంతో పచ్చనిచెట్లు కనుమరుగవడంతో పాటుగా ఆహ్లాదకర వాతావరణం కనుమరుగవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మదనపల్లెలో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో పట్టణంలో 50 వేల మొక్కలు నాటి వాటి సంరక్షించాలనే సంకల్పం తీసుకున్నామన్నారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను మున్సిపాలిటీకి అప్పగించి, వారి ఆధ్వర్యంలో పర్యవేక్షణ జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలు గ్రీన్ మదనపల్లె కార్యక్రమంలో తమవంతు బాధ్యతగా ఇంటి ముందు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పెళ్లిళ్లకు, శుభకార్యాలకు, బర్త్‌డేలకు గుర్తుగా మొక్కను నాటి సామాజిక బాధ్యతతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగారపునవీన్, లక్ష్మీదేవి, ఓంప్రకాష్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి



టపాసుల దుకాణదారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ ధనుంజయులు

నిమ్మనపల్లె : టపాసులు విక్రయించే వారు నిబంధనలను తప్పకుండా పాటించాలని తహసీల్దార్ ధనుంజయులు ఆదేశించారు. శనివారం మదనపల్లె రోడ్డులోని టీఎస్‌ఆర్ కల్యాణమండపం సమీపంలో దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ టపాసుల విక్రయ దుకాణాలు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. టపాకాయల వినియోగంపై జాగ్రత్తలతో కూడిన సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. టపాసులను అధిక ధరలకు విక్రయించవద్దని హెచ్చరించారు. వాల్మీకిపురం అగ్నిమాపక శాఖ ఏఎస్‌ఐ బాబయ్య, మండల సర్వేయర్ గోపీనాథ్, ఆర్‌ఐ అనంతలక్ష్మీ, హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, వీఆర్వో నాగేశ్వరరావు, షేక్ ఇమ్రాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీఐ ప్రసాద్ బాబు

వాల్మీకిపురం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు సూచించారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కళాశాలలో ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పెద్దపరాజు, అధ్యాపకులు నారాయణ స్వామి, జ్యోతి, ప్రవీణ్ కుమార్, సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో స్టాల్స్ కేటాయింపు

మదనపల్లె : పట్టణంలో నూతనంగా ప్రారంభించనున్న రైతుబజార్‌లో రైతులకు కేటాయించినవి పోనూ మిగిలిన స్టాల్స్‌ను ఆసక్తి కలిగిన వ్యాపారులకు లాటరీ పద్ధతిలో కేటాయిస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ త్యాగరాజు తెలిపారు. శనివారం రైతుబజార్ కార్యాలయం పత్రికా ప్రకటనలో వివరాలు తెలిపింది. రైతుబజార్‌లోని మొత్తం 30 స్టాల్స్‌లో 22 స్టాల్స్ రైతులకు ఉచితంగా కేటాయించామన్నారు. మిగిలిన 8 స్టాల్స్‌కు ఒకో స్టాల్‌కు రూ.30 వేలు డిపాజిట్, నెలసరి అద్దె రూ.4 వేలుగా జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్ణయించారని తెలిపారు. స్టాల్స్ కావాలనుకున్న వారు లాటరీ పద్ధతిలో స్టాల్స్ పొందాల్సి ఉంటుందన్నారు. ఈనెల 29వ తేదీ, మంగళవారం ఉదయం 11 గంటలకు రైతుబజార్‌లో స్టాల్స్ కేటాయింపునకు లాటరీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారి పేరుమీద డీడీ తీసి దానిని సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. లాటరీలో విజేతలకు స్టాల్స్ కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 9182361536 సంప్రదించాలని కోరారు.

లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

కలికిరి: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనిదినాలు నిర్దేశించిన లక్ష్యాలను సిబ్బంది అధిగమించాలని డ్వామా పీడీ టి. వెంకటరత్నం ఆదేశించారు. కలికిరి సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో శనివారం కలికిరి క్లస్టర్ పరిధిలోని మండలాల ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కలికిరి క్లస్టర్‌లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల్లో వెనుకబడి ఉందని, సిబ్బంది కూలీలకు పనిదినాలు పెంచాలని ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమంలో గుర్తించిన పనులు త్వరలో ప్రారంభమయ్యేటట్లు ఏపీఓలు చర్యలు చేపట్టాలని సూచించారు. క్యాటిల్‌షెడ్ పనులకు అంచనాలు రూపొందించి పంపాలని, ఇప్పటికే ప్రారంభమైన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సిబ్బంది కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓలు సుజాత, నాగరాజ, రమేష్, మహేశ్వర, గౌరీశంకర్, సునీల్‌కుమార్, టెన్నికల్ అసిస్టెంట్‌లు, ఏపీడీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి

పీలేరురూరల్ : మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి. కేశవరెడ్డి, పీలేరు సీఐ యుగంధర్ హెచ్చరించారు. శనివారం పీలేరు పట్టణంలోని మెడికల్ స్టోర్‌లను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మెడికల్ స్టోర్ యాజమాన్యాయానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల పీలేరులో ఇద్దరు విద్యార్థులు గంజాయి మత్తులో రైలు కిందపడి మృతి చెందడం దురదృష్టకరమన్నారు. మెడికల్ షాపులో మత్తు పదార్థాలు ఇంజక్షన్లు, టాబ్లెట్ రూపంలో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టణంలో 80 మెడికల్ షాపులు ఉన్నాయని, ప్రతి షాపులో సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- గోతులమయంగా మదనపల్లె రోడ్లు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు, వాహనదారులు



గుంతలమయంగా మారిన బెంగళూరు రోడ్డు



పాడైపోయిన బెంగళూరు బస్టాండ్ రోడ్డు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్లు గుంతలు తేలి ప్రమాదాలకు నిలయంగా మారాయి. స్థానిక బెంగుళూరు రోడ్డు నుంచి చిప్పిలి వరకు రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రతి ఇరవై అడుగులకో గుంతలతో పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాంతంలో నిత్యం బెంగుళూరు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు పలువురు ఈ రహదారిలో ప్రయాణిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. స్థానిక సీటీఎం రోడ్డులో మున్సిపల్ అర్బీ వద్ద నుంచి తట్టివారిపల్లె వరకు రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఈ దారిలో నిత్యం తిరుపతికి వెళ్లే బస్సులతో పాటు ద్విచక్రవాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం ఈ రోడ్డు మొత్తం బస్సులతో రద్దీగా ఉంటుంది. రహదారి గుంతలమయం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. వాహనాలు దెబ్బతినడంతో పాట ఒళ్లు హూనం అవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. స్థానిక చిత్తూరు బస్టాండు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు రోడ్డు గోతులుగా మారింది. స్థానిక బెంగుళూరు బస్టాండు నుంచి అప్పారావువీధి వరకు గుంతమయమైంది. నిత్యం ప్రజలు సంచరించడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.